ఈనాడు మహబూబ్‌నగర్

శనివారం అక్టోబరు 12, 2024

అలంపూర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జోగులాంబ సిద్ధిధాత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఉదయం మహా

సిద్ధిధాత్రీ దేవిగా జోగులాంబ

పూర్ణాహుతి, సాయంత్రం శమీ పూజ, నదీ హారతి అనంతరం రాత్రి 7 గంటలకు తుంగభద్ర నదిలో తెప్పోత్సవం నిర్వహించనున్నారు. తెప్పోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తులతో పుష్కర ఘాట్ కిక్కిరిసిపోతుంది. అనంతరం ధ్వజావరోహణతో ఉత్సవాలు సమాప్తం అవుతాయి.


అలంకారంలో జోగులాంబ


శాకంబరి అలంకరణలో మైసమ్మ

శాకంబరిదేవిగా మైసమ్మ అమ్మవారు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కాకర్లపహాడ్ గ్రామ సమీపంలోని పర్వతాపురం మైసమ్మ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం శాకంబరి దేవిగా అలంకరించారు. ఆలయంలో మహిళలు కుంకుమార్చన చేశారు.

కొండారెడ్డిపల్లికి కొత్త సొబగులు

- సీఎం హోదాలో తొలిసారిగా రేవంత్ స్వగ్రామానికి రాక!
- గ్రామస్థులతో దసరా వేడుకలు, అభివృద్ధి పనుల ప్రారంభం




సీఎం ప్రారంభించనున్న అమర జవాను యాదయ్య స్మారక లైబ్రరీ

ఈనాడు, మహబూబ్‌నగర్, న్యూస్ టుడే, వంగూరు : ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి మొదటిసారిగా నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని స్వగ్రామం కొండారెడ్డిపల్లికి శనివారం వస్తున్నారు. అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గ్రామస్థులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ప్రతి ఇంటికి సౌర కాంతులు.. : కొండారెడ్డిపల్లిలో ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా 'పీఎం సూర్య ఘర్ యోజన' కింద ఎంపిక చేశారు. గ్రామంలో గృహ విద్యుత్తు కనెక్షన్లు 499 ఉన్నాయి. ఇతర విద్యుత్తు కనెక్షన్లు కూడా చాలానే ఉన్నాయి. వీటన్నింటికి సౌర ఫలకాలను ఏర్పాటు చేయనున్నారు. తొలుత 25 ఇళ్లకు ఏర్పాటుచేసిన సౌర విద్యుత్తు వ్యవస్థను సీఎం ప్రారంభించనున్నారు.

కార్యక్రమాలు ఇలా.. : గ్రామంలో రూ. 72 లక్షలతో పంచాయతీ భవనం, రూ.55 లక్షలతో అమర జవాను యాదయ్య స్మారక గ్రంథాలయం, రూ. 45లక్షలతో బీసీ సామాజిక భవనం, రూ. 45లక్షలతో పశు వైద్యశాలను నిర్మించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను సీఎం ఆవిష్కరించి ఆయా భవనాలను ప్రారంభిస్తారు.

ఎన్నో ఆశలు.. : సీఎం స్వగ్రామానికి వస్తున్న నేపథ్యంలో వరాలు కురిపిస్తారని జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. సీఎం తాను నల్లమల బిడ్డనని పదే పదే చెబుతుంటారు. నల్లమలలో ఆదివాసీలకు పోడుభూముల పట్టాలు ఇస్తామని గతంలో ప్రకటించారు. పోడు భూములపై హక్కుల కోసం ఉమ్మడి జిల్లాలో 18,190, నాగర్‌కర్నూల్ జిల్లాలో 11,800 మంది దరఖాస్తు చేసుకున్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కేఎల్‌ఐ అదనపు ఆయకట్టు పనులు ముందుకు సాగడం లేదు. కొండారెడ్డిపల్లి పర్యటన నేపథ్యంలో సీఎం ఆయా అంశాలతో పాటు ప్రత్యేక నిధుల కేటాయింపుపై ప్రకటన చేసే అవకాశముందని స్థానికులు ఆశిస్తున్నారు.

ముడా ఛైర్మన్‌గా లక్ష్మణ్ యాదవ్



పాలమూరు పురపాలకం, పాలమూరు : మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) ఛైర్మన్‌గా పాలమూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది కె. లక్ష్మణ్ యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. దానకిశోర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ కమిటీల్లో వివిధ పదవులు చేపట్టిన లక్ష్మణ్ యాదవ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సద్దలగుండు వార్డు నుంచి రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ప్రస్తుతం అదే వార్డు నుంచి ఆయన సతీమణి స్వప్న కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు.

పోలీసు సేవలపై లఘుచిత్రాల పోటీలు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ తదితర పోటీల్లో పాల్గొనడానికి ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లను ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ డి. జానకి శుక్రవారం తెలిపారు. అమర పోలీసుల జ్ఞాపకార్థం ఈ నెల 21న పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీసులకు సంబంధించిన అంశాలపై ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిం తీయడానికి ముందుకు రావాలన్నారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో వారు ప్రదర్శిస్తున్న తెగువ, మూఢ నమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాల నిర్వహణ తదితర అంశాలపై తీసిన ఫొటోలు, వీడియోలు తమకు ఈ నెల 20 వరకు పంపించాలన్నారు.

14న అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో అండర్- 23 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 14న పిల్లలమర్రి దారిలోని ఎండీసీఏ మైదానంలో చేపట్టనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్ తెలిపారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, తెల్లటి క్రీడా దుస్తులతో హాజరు కావాలని సూచించారు.

విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు


రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



దమగ్నాపూర్ వద్ద సమీకృత పాఠశాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర, మాజీ ఎమ్మెల్యేలు

బాలానగర్, న్యూస్‌టుడే : విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు విధానాలు రూపొందిస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ పరిధి ఏర్గట్ల వద్ద, బాలానగర్ మండలం పెద్దాయపల్లిలో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి శుక్రవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత కేసీఆర్ పాలన ఫామ్‌హౌజ్‌కు పరిమితమైందని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. ప్రారంభించిన కొన్ని గురుకులాలు కూడా ప్రైవేట్ భవనాల్లోనే ఉన్నాయన్నారు. నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందించేందుకే సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో పాఠశాలలో 2వేల మంది విద్యార్థులు చదువుకోవచ్చన్నారు. తాము అధికారంలోకి రాగానే ఉద్యోగ నియామకాలు చేపట్టి, టీచర్లను భర్తీ చేశామని తెలిపారు. రుణమాఫీ హామీని నిలబెట్టుకోవటాన్ని ఓర్వలేకనే మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కురుమూర్తి గుట్టపై ఘాట్‌రోడ్డు, పొన్నకల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి, మాజీ ఎమ్మెల్యేలు సీతాదయాకర్‌రెడ్డి, స్వర్ణ సుధాకర్, డీశావ్ రవీందర్, నేతలు అరవింద్‌కుమార్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కత్తుల, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దత్తాత్రేయ, వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, తిరుపతి, సాదు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అబద్ధాల పాలన: డీకే అరుణ



మరికల్‌లో మైనార్టీ నాయకుడి ద్వారా సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఎంపీ

మరికల్, ధన్వాడ, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పాలన అబద్ధాలతోనే కొనసాగుతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మరికల్, ధన్వాడ మండలాల్లో పర్యటించారు. తీలేర్‌లో పార్టీ పతాకావిష్కరణ నిర్వహించిన ఎంపీ అక్కడ, మరికల్, ధన్వాడ పట్టణాల్లో సభ్యత్వ నమోదు ప్రారంభించి హజ్రతపై పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఆ తర్వాత సైతం అదే విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. గత భారాస ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో ప్రజాధనాన్ని దోచుకోగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరుతో దోపిడీకి తెరతీసిందన్నారు. ఈ డబ్బును హరియాణా, జమ్ముకాశ్మీర్ ఎన్నికలకు తరలించగా, ఇపుడు మహారాష్ట్రకు పంపడానికి ప్రణాళిక రూపొందించుకున్నారు. ఎమ్మెల్యేలు సొంతంగా సైతం పట్టించుకోవడంలేదని, ఇందుకు ధన్వాడ ఉదాహరణ అని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కనీసం పంతాన నిర్మాణానికి నిధులు తేలేదన్నారు. కార్యక్రమం అనంతరం ఎంపీ దుర్గాదేవి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్, ఉమేష్ కుమార్, నర్సన్‌గౌడ్, రాంచంద్రయ్య, ఉదయ భాను, సురేందర్, భాస్కర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నీ శక్తే ఆయుధమైతే..




మనలో అపారమైన శక్తి ఉంది.. దాన్ని జాగృతం చేస్తే ఎన్నో అద్భుతాలు జరుగుతాయి. శక్తి స్వరూపిణి అయిన దుర్గమ్మ అలంకారాలు, ఆయుధాలు మనకు ఈ విషయాన్ని తెలియజేస్తాయి. సరైన జీవన విధానమే శక్తిని ప్రజ్వలింపజేస్తుంది. మన జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ..
– న్యూస్‌టుడే, కోస్గి



- సింహం అంటేనే అందరికీ భయం. అమ్మవారు దాన్ని అదుపులో పెట్టి స్వారీ చేస్తారు. దూకుడు, హింసాత్మక ధోరణులను అదుపులో ఉంచుకునే శక్తి తనలో ఉందని అమ్మవారు చూపించారు. దాన్ని మనం ఆదర్శంగా తీసుకొని మనలోని హింసాత్మక ధోరణి తగ్గించుకోవాలి.




- చుట్టూ ఎంత హీనమైన పరిస్థితులున్నా మన వ్యక్తిత్వంతో వికసించాలని కమలం పువ్వు తెలియజేస్తుంది. అందుకేనేమో అమ్మవారు కమలం పువ్వుపై కూర్చొని ఉంటారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో బెట్టింగ్‌లు, మట్కా, గుట్కా, జూదం, మద్యపానం వంటి దుర్లక్షణాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. చుట్టూ ఇలాంటి పరిస్థితుల నడుమ ఎలాంటి ప్రభావానికి లోను కాని వారిని ఎందరినో చూశాం.



- శక్తి సామర్థ్యాలకు, ఏకాగ్రతకు ప్రతీక విల్లు. లక్ష్యం నెరవేరాలంటే ఏకాగ్రతతో విల్లు సంధించాలి. లక్ష్యానికి గురి తప్పకుండా తగిలేలా మన ప్రయత్నం కొనసాగాలి. జిల్లాకు చెందిన పలువురు పేదింటి పిల్లలు ప్రతికూలతలను అధిగమించి మూడు, నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారంటే ఎంతటి ఏకాగ్రత ఉన్నదో అర్థం అవుతుంది.



- త్రిశూలం అనేది సత్వ, తమో, రజో గుణాలను సూచిస్తుంది. ఈ మూడు గుణాలు నియంత్రణలో ఉంటే అద్భుత విజయాలు సమకూరుతాయి.



- చక్రం ధర్మానికి చిహ్నంగా, జీవితంలో మన విధులు పక్కాగా నిర్వర్తించాలనే విషయాన్ని బోధిస్తుంది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు అందరూ తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తే వ్యక్తిగతంగానే కాకుండా సమాజ అభివృద్ధికి దోహదపడవచ్చు.



- చెడు, అజ్ఞానాన్ని నిర్మూలించేందుకు జ్ఞానం అనే ఖడ్గాన్ని ఆయుధంగా చేసుకోవాలని శక్తి స్వరూపిణి సందేశాన్ని ఇస్తుంది.



- బలం, విధేయతకు ప్రతిరూపంగా గదను తెలుపుతారు. ప్రతి ఒక్కరిలో ఏదోఒక శక్తి ఉంటుంది. దానిని మనమే గుర్తించాలి. ఆ రంగంలో ప్రావీణ్యం సంపాదిస్తే ఉన్నతంగా ఎదుగుతాం. దేహబలం, ఆర్థిక బలం ఎంత ఉన్నా, వినయ, విధేయతలు కలిగి ఉండాలి. మనం నేర్చుకున్న నైపుణ్యాలే మనకు బలంగా మారాలి.

- శంఖం సంతోషానికి చిహ్నం. సంతృప్తితోనే సంతోషం కలుగుతుంది. పక్కవారిని చూసి లేనిపోని వాటికి పరుగులు పెడితే ఆనందం ఆవిరైపోతోంది. ఉమ్మడి జిల్లాలో ఆన్‌లైన్ గేమ్స్, భూ తగాదాలు, హత్యలు ఆత్మాశకు పోయి తెచ్చిన అనర్థాలే.

మనం చేసే పనిలో విజయం సాధించాలని కోరుకుంటాం. అందుకు తగిన కృషి, పట్టుదల, నేర్పు, ఓర్పు, సహనం ఎంతో అవసరం. మన పండగలు ఎన్నో జీవిత పాఠాలు, విలువలు బోధిస్తాయి. దసరా పండగ సైతం ఎన్నో అంశాలను మనకు తెలియజేస్తుంది. జమ్మి వృక్షాన్ని పూజించడం, పాలపిట్టను దర్శించడం, నవరాత్రులు అమ్మవారిని ఆరాధించడం, బతుకమ్మలను కొలవడం.. వంటివి ఎన్నో సందేశాలను ఇస్తాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వెయ్యికిపైగా దుర్గమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి నిత్యపూజలు చేశారు.



అంతర్గత శత్రువును జయించవచ్చు: దుర్గామాత శత్రు సంహారాన్ని చేయడం బాహ్యంగా చెప్తుంటున్నా, అంతర్గతంగా మనలో ఉండే కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములు అనే శత్రువులను ఓడించాలని సందేశం ఈ పండగ ఇస్తుంది. వీటిని గెలిచినప్పుడే మనం సంపూర్ణ వ్యక్తులుగా నిలుస్తాం. అమ్మవారిని కొలవడం మూలంగా మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ప్రకృతి స్వరూపం అయిన శక్తిని ప్రసన్నం చేసుకోవడానికి, మానసిక రుగ్మతల నుంచి బయటపడతాం.

- చంద్రశేఖర జోషి, పండితుడు, మహబూబ్‌నగర్

సందేశాత్మక ఆచారాలు



పత్రంతో ప్రమాణం: దసరా రోజు జమ్మి పత్రాలు పరస్పరం మార్చుకుంటూ స్నేహితులు, బంధువులు కలిసి ఉండాలని ప్రకృతి సాక్షిగా ప్రమాణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి సొంత ఊళ్లకు వచ్చేవారు మనసు విప్పి మాట్లాడుకోవడానికి, తిరిగి ఒక్కటిగా కలిసి ఉండేందుకు ఈ సంబరం వేదికగా ఉంటుంది. విలువైన ఔషధ విలువలున్న జమ్మి చెట్టును కాపాడుకోవాలని బోధిస్తుంది.



భరోసా చిహ్నం ఆయుధపూజ: జీవనోపాధిలో సహాయపడే ప్రతి వస్తువును అమ్మవారి వద్ద ఉంచి పూజిస్తారు. వ్యవసాయ పరికరాలు, కర్మాగారాలు, మెకానిక్ దుకాణాలలోని మిషనరీ మొదలుకుని ఆఖరికి చిన్న పిల్లల పుస్తకాలు వరకు పూజిస్తారు. వారి రంగంలో ప్రగతికి అవే కదా ఆయుధాలు. వృత్తి నైపుణ్యం ఈ ఆయుధాలతోనే సాధ్యం కాబట్టి భరోసాకు చిహ్నంగా ఆయుధపూజ చేస్తారు.



పాలపిట్ట: విజయదశమి పండగ వేళ పాలపిట్ట కనిపిస్తే ఆ ఏడాదంతా విజయాలతో కూడిన అదృష్టం వరిస్తుందని విశ్వసిస్తారు. పాలపిట్ట అంటే తెలియని పాలపిట్టను చూసేందుకు పల్లెటూళ్లలో పంట పొలాలకు వెళ్తారు. పక్షులు, జంతువుల పట్ల ప్రేమ కలిగి ఉండాలని, జీవ వైవిధ్య ఆవశ్యకతను తెలియజేస్తుంది.



ప్రకృతిపై ప్రేమను పెంచే ఆచారం: దసరా వేడుకల్లో జమ్మి చెట్టును పూజించడం, పాలపిట్ట దర్శనం కోసం పక్షిని బయళ్లలో తిరగడం వంటి ఆచారాలు ప్రకృతిపై ప్రేమను పెంచుతాయి. పర్యావరణ పరిరక్షణ బాధ్యతను గుర్తుచేస్తాయి. నవరాత్రి వేడుకల్లో భాగంగా బతుకమ్మ ఉత్సవాలు పచ్చటి పరిసరాల ఆవశ్యకతను, వైవిధ్యాన్ని చాటుతాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ దుర్గామాత ఆకారాల్లో చిన్నారులను బాల స్వాములను చేస్తే చక్కని విలువలు నేర్చుకునే వీలుంది.

- వార్ల మల్లేశం, జాతీయ హరిత దళ సమన్వయకర్త

అంబరాన్నంటిన మహా బతుకమ్మ



సంబరాల్లో గాయకులు, కళాకారులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : అచ్చంపేటలో నల్లమల మహా బతుకమ్మ సంబరాలు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు సందడి చేశారు. నల్గొండ గద్దర్ (నర్సిరెడ్డి), రేలారే రేలా గంగా, గాయకుడు బోలే షావలి కళా ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలతో నల్లమల ఖ్యాతిని చాటి చెప్పాలని నిర్ణయించామన్నారు. ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి రూ.50వేలు, రూ.25వేలు, రూ.15వేల చొప్పున నగదు ప్రోత్సాహం ఇస్తామని చెప్పారు. సీబీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా.అనురాధ, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ గంగాపురం రాజేందర్, పుర అధ్యక్షుడు గార్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిందూ సమాజం సంఘటితంతోనే దేశం సుభిక్షం

ఆరెస్సెస్ దక్షిణ మధ్య క్షేత్ర నేత అమర లింగన్న





ప్రసంగిస్తున్న అమర లింగన్న, వేదికపై పల్లె నాగయ్య, వసంతం వెంకటేశ్వర్లు.. ప్రార్థన చేస్తున్న స్వయం సేవకులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : హిందూ సమాజం జాగృతమై, సంఘటితమైతేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, ఇదే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్) అకుంఠిత దీక్షతో పనిచేస్తోందని సంస్థ దక్షిణ మధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాలు, విజయదశమి వేడుకలు నిర్వహించారు. ముఖ్యవక్తగా అమర లింగన్న మాట్లాడుతూ ఆరెస్సెస్ ఏర్పడి 100 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ ఏడాది సమాజంలో పరివర్తన కోసం ప్రత్యేకంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వ్యక్తిలో దేశభక్తిని నింపటం, కులవివక్ష నిర్మూలన, ఆదర్శ కుటుంబ వ్యవస్థ, పర్యావరణ పరిరక్షణ కోసం ఆరెస్సెస్ నిరంతరం పని చేస్తుందన్నారు. విజయదశమి స్ఫూర్తితో దేశం, ధర్మ పరిరక్షణకు పాటుపడాలని, కులాలు పట్టించుకోకుండా ప్రతి హిందువు సోదరుడే అనే భావనతో జీవించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యాపారవేత్త పల్లె నాగయ్య మాట్లాడుతూ భారతీయ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఆరెస్సెస్ సేవలను కొనియాడారు. కార్యక్రమానికి ముందుగా నగరంలో చేపట్టిన పథ సంచలనం, మైదానంలో చేసిన యుద్ధ కళలు, యోగా, హోష్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆరెస్సెస్ జిల్లా సంఘచాలక్ వసంతం వెంకటేశం, నేతలు పాల్గొన్నారు.



కర్నెతాండలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

గిరిజనుల సంస్కృతి గొప్పది : చిన్నారెడ్డి

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కర్నెతండాలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన తుల్జాభవాని వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కర్నెతండా ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పూర్తి చేయాలని మాజీ ఎంపీపీ కోరగా త్వరలోనే పూర్తి చేయించి ముఖ్యమంత్రితో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చి అమ్మవారి సమక్షంలో ఉంచారు. గిరిజనుల బతుకమ్మ ఆటపాటలు అలరించాయి. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన నాయకులు బెల్యానాయక్, రామ్‌బాల్‌నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

వివాహమైన నెల నుంచే వేధింపులు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణం



సుప్రియారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: వివాహమైన 8 నెలలకే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు, బాధిత మహిళ తండ్రి వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం, నందిపేటకు చెందిన సుప్రియారెడ్డి(26)ను అదే జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మిపల్లికి చెందిన మద్దూరు రాఘవేందర్‌రెడ్డికి ఇచ్చి మార్చి 24న వివాహం చేశారు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. కేపీహెచ్‌బీ ఠాణా పరిధి శంషీగూడలో ఉంటున్నారు. వివాహమైన నెల నుంచే రాఘవేందర్‌రెడ్డిని భార్యని వేధించసాగాడు. తాను చెప్పినట్టే వినాలని, ఆమె జీతం తన బ్యాంకు ఖాతాలోనే జమచేయాలని, ఇల్లు కట్టుకునేందుకు పుట్టింటి నుంచి 3 ఎకరాలు రాయించుకురావాలని సుప్రియను రాఘవేందర్‌రెడ్డి ఒత్తిడి చేయసాగాడు. ఇలా గొడవల్లో సాగుతోన్న రాఘవేందర్‌రెడ్డి-సుప్రియ సంసారంలో గురువారం రాత్రి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. 11.30 గంటల సమయంలో సుప్రియ ఉరేసుకున్నట్లు పక్కింటి వారు ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. ఆ సమయంలో రాఘవేందర్‌రెడ్డి విధులకు వెళ్లాడు. తమ కుమార్తె రాత్రి 8 గంటల సమయంలో తమతో మాట్లాడిందని, ఆమె మృతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశామని సుప్రియరెడ్డి తండ్రి బుచ్చిరెడ్డి తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండగకు ఊరెళ్తూ.. ట్రావెల్ బస్సును ఢీకొని ఒకరి మృతి

కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని విలియంకొండ తండా స్టేజీ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో వనపర్తి మండలం మెంటెపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(38) మృతి చెందారని ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ప్రమాదంలో అతని స్నేహితుడు ఖాజమైనోద్దీన్ తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ఉపాధి కోసం కొత్తకోటలో ఉంటున్న శ్రీనివాస్‌రెడ్డి దసరా పండగ కోసం శుక్రవారం రాత్రి స్నేహితుడితో కలిసి సొంత గ్రామం వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడు..

బాలానగర్, న్యూస్‌టుడే: టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మొదంపల్లి గ్రామానికి చెందిన స్వామి (25) మండల కేంద్రంలో ఓ కిరాణ దుకాణంలో దసరా పండగ సామగ్రి తీసుకొని ద్విచక్రవాహనంపై వెళ్తూ మార్గమధ్యలో పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న మండలంలోని చింతకుంటతండాకు చెందిన టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టిప్పర్‌ను ఠాణాను తరలించారు.

విద్యుదాఘాతంతో దంపతుల మృత్యువాత

పండగ పూట విషాదం



బక్కన్న, నారమ్మ

రేవల్లి (గోపాల్‌పేట), న్యూస్‌టుడే : వనపర్తి జిల్లా రేవల్లి మండలం కొత్తబండరావిపాకుల గ్రామానికి చెందిన భార్యాభర్తలు బక్కన్న(55), నారమ్మ(50) శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. గ్రామస్థుల కథనం మేరకు దంపతులిద్దరు సాయంత్రం గ్రామానికి సమీపంలోని శానాయిపల్లి గుట్టలపైకి సీతాఫలాలు తెంచుకురావడానికి వెళ్లారు. కాయలు తెంచుకుని వస్తుండగా గుట్టకు సమీపంలో శానాయిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన వేరుసెనగ పైరును అడవి జంతువుల నుంచి రక్షించుకోవడానికి పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్తు కంచెను తగలడంతో విద్యుదాఘాతంతో భార్యాభర్తలిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. చీకటి పడినా తల్లిదండ్రులు ఇంటికి రాకపోవడంతో కుమారుడు శ్రీరాములు టార్చిలైటు తీసుకుని గుట్టలవైపు వెళ్లారు. ఓ చోట వారు విగతజీవులై పడి ఉండటాన్ని గుర్తించి రోదిస్తూ గ్రామంలోకి వచ్చి మాజీ సర్పంచి బాలస్వామికి విషయం తెలిపారు. ఆయన, మరికొందరు వెళ్లారు. మృతదేహాల వద్దకు చేరుకున్న సమయంలో వారివెంట వెళ్లిన ఒక కుక్క వారి కళ్లముందే విద్యుత్తు కంచెకు తగిలి ప్రాణాలు కోల్పోయింది. వెంటనే పొలం యజమానిని పిలిపించడంతో ఆయన విద్యుత్తు సరఫరాను తొలగించారు.

ముంపులో భూమి కోల్పోయి..: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల జలాశయంలో బండరావిపాకుల గ్రామం ముంపునకు గురైంది. బక్కన్నకు చెందిన వ్యవసాయ భూమి ముంపులో పోయింది. ఇటీవల కొత్త బండరావిపాకులలో ఇల్లు నిర్మించుని కుమారులతో కలిసి నివాసం ఉంటున్నారు. భూమి కోల్పోవడంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం సీజన్ కావడంతో సీతాఫలాలు తెంపి అమ్ముకోవడానికి దంపతులిద్దరు వెళ్లి మృత్యువాత పడ్డారు. పండగపూట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైలు ఢీకొని వివాహిత దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వివాహిత దుర్మరణం పాలైన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం జమిస్తాపూర్‌కు చెందిన భాగ్యలక్ష్మి (28) కుటుంబం కొంత కాలంగా కలెక్టర్ బంగ్లా ఫ్లైఓవర్ సమీపంలో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్లిన భాగ్యలక్ష్మి రైలు ఢీకొని మృతి చెందింది. ఈ మేరకు భర్త ఆంజనేయులు గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

తెరపై ఈనాడు

శ్రీనివాస - **విశ్వం**, తిరుమల - **వెట్టియాన్**
వెంకటేశ్వర - **దేవర**, వెంకటాద్రి - **మా నాన్న సూపర్ హీరో**, మైత్రి శ్రీకృష్ణ - **మార్టిన్**
- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

విదేశీ విద్యావకాశాలు సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో జేపీఎన్‌సీఈ ఛైర్మన్ కేఎస్ రవికుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ గ్రామీణం : బీటెక్ పూర్తిచేశాక విదేశాల్లో విద్యాభ్యాసం ఎలా చేయాలో తెలియని విద్యార్థులకు సదస్సులు మార్గనిర్దేశం చేస్తాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్‌లో జేపీఎన్‌సీఈ కళాశాల, వన్ విండో సంస్థ ఆధ్వర్యంలో విదేశీ విద్య అవకాశాలపై శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సుకు అతిథిగా హాజరై మాట్లాడారు. జయప్రకాశ్ నారాయణ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, జేపీఎన్‌సీఈ ఛైర్మన్ కేఎస్. రవికుమార్, వైస్ ఛైర్మన్ వెంకట రామారావు, డల్లాస్ బాప్టిస్ట్ వర్సిటీ ప్రతినిధి డా. సంజయ్ పురుషోత్తం, ప్రోగ్రాం డైరెక్టర్ జోసఫ్ పార్క్, వన్ విండో సంస్థ ప్రతినిధి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్: రాజరాజేశ్వరిమాత ఆలయంలో మహిషాసురమర్దనిగా అలంకరణ


బ్రాహ్మణవాడలోని వాసవీమాత ఆలయంలో..


సింహగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో...


రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దుర్గామాతగా..


జడ్చర్ల: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

అమ్మవారి ఉత్సవం.. భక్తుల సంబురం


లక్ష్మీపల్లిలో మహిషాసురమర్దనిగా అమ్మవారు

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. వాసవీమాత ఆలయంలో కనక దుర్గామాతగా దర్శనమిచ్చారు. లక్ష్మీనగర్, వెంకటేశ్వరకాలనీలోని రాజరాజేశ్వరిమాత ఆలయంలో, సింహగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మహిషాసురమర్దనిగా అలంకరించి పూజించారు. రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దుర్గామాతగా దర్శనమిచ్చారు. టీచర్స్‌కాలనీ రామాలయంలో పుర ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొని దుర్గామాతకు పూజలు చేశారు. పలు ప్రాంతాల్లోని దుర్గామాత మండపాల వద్ద మహిళలు బతుకమ్మలు ఆడారు. మహబూబ్‌నగర్ పట్టణం వీరన్నపేటలోని చౌడేశ్వరిమాతకు తొగట వీర క్షత్రియ సమాజంలో ఆధ్వర్యంలో 108 కలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర, కోయిలకొండ, అడ్డాకుల, గండీడ్, బాలానగర్ తదితర మండలాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. **-న్యూస్‌టుడే బృందం**


కోయిలకొండ: అంకిళ్ల గ్రామంలో


బృందావన్‌కాలనీలో బతుకమ్మ చివరిరోజు వేడుకల్లో మహిళలు..


గణేశ్‌నగర్‌లో దుర్గామాతను దర్శించుకున్న పురఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్


108 కలశాల ఊరేగింపులో తొగట వీర క్షత్రియ సమాజం మహిళలు

ఘనంగా ఆరెస్సెస్ పథ సంచలన్

హన్వాడ, న్యూస్‌టుడే : హన్వాడలో ఆరెస్సెస్ ఆధ్వర్యంలో శుక్రవారం పథ సంచలన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు హన్వాడ ప్రధాన రహదారి, వీధుల్లో కవాతు చేశారు. అనంతరం రైతు సేవా సహకార సంఘం ఆవరణలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఏఎస్ఐ భీమయ్య హాజరై మాట్లాడారు. ఆరెస్సెస్ పట్టణ ప్రముఖ్ కట్ట ప్రభాకర్, భాజపా మండల అధ్యక్షుడు వెంకటయ్య, కార్యకర్తలు హాజరయ్యారు.

బాలికా విద్యకు ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని అందుకు అనుగుణంగా బాగా చదివి ప్రయోజకులు కావాలని జిల్లా మహిళా, శిశు, సంక్షేమాధికారి జరీనా బేగం అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల సదనంలో భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాలికా సంరక్షణ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాలికలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఛైర్‌పర్సన్ నయీముద్దీన్, సభ్యులు జేజేబి గ్రేస్, సీడీపీవో శైలశ్రీ, బీఆర్‌బీ సమన్వయకర్త వెంకటమ్మ, డీసీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

గుంత.. ప్రమాదాల చింత!



ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులపై గోతులు పడ్డాయి. భూత్పూర్ మండలం చౌలతండా ఎల్కిచర్ల గ్రామాల నడుమ వాగు పైనున్న కల్వర్టు మధ్యలో గుంత ఏర్పడింది. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. దగ్గరకు వస్తే గానీ గుంత కనిపించడం లేదు. రాత్రి వేళల్లో దెబ్బతిన్న రోడ్డును గమనించక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కల్వర్టు పైనుంచి కిందపడితే ప్రాణాలకే ప్రమాదం. అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.
- ఈనాడు, మహబూబ్‌నగర్

సంఘాల లావాదేవీల విచారణకు అడ్డంకులు


మెప్మా కార్యాలయంలో విచారణకు కోయనగర్ నుంచి వచ్చిన ఒకే సంఘం సభ్యులు

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : భారీ కుంభకోణం వెలుగు చూసిన కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో చేపట్టిన విచారణకు అడుగడుగునా అడ్డంకులు పడుతున్నాయి. సమాఖ్యలో ఈ నెల 5న దొడ్డలోనిపల్లిలోని రెవెన్యూ వార్డు కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో జరిపిన ఖాతాల తనిఖీకి కోయనగర్ సమాఖ్యలోని సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలి రోజు 12 సంఘాల లావాదేవీల తనిఖీ పూర్తి కావటంతో మిగతా సంఘాల సభ్యులు వెనుదిరిగారు. మరుసటి రోజు దొడ్డలోనిపల్లిలోనే తనిఖీలు నిర్వహించకుండా స్థలాన్ని మెప్మా కమ్యూనిటీ భవనానికి మార్చారు. దొడ్డలోనిపల్లి రెవెన్యూ వార్డుకు ఖాతాల పుస్తకాలతో చేరుకున్న చాలా సంఘాల మహిళలు నిరుత్సాహపడ్డారు. తమకు జరిగిన అన్యాయాన్ని స్థానికంగా ధైర్యం చేసి చెప్పిన మహిళలు విచారణను జిల్లా కేంద్రంలోని మెప్మాకు మార్చటంతో వెనకంజ వేస్తున్నారు. 7న మెప్మా భవనంలో ఖాతాల తనిఖీలు నిర్వహించగా 10 సంఘాల మహిళలే హాజరయ్యారు. 8వ తేదీ విచారణకు రెండు సంఘాల మహిళలే వచ్చారు. మెప్మా సీవోలు అంతగా పట్టించుకోకపోగా బతుకమ్మ సంబరాలు ఉన్నందున రావడం లేదని చెప్పుకొచ్చారు. 9వ తేదీన విచారణకు ఒకే సంఘం సభ్యులు వచ్చారు. ఇంకా 8 సంఘాలు మిగిలి ఉండగానే తనిఖీలకు బ్రేకులు పడటం వెనక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆర్పీ తను ఏ స్థాయిలో మోసం చేశారో తెలుసుకునేందుకు 8 సంఘాల సభ్యులు ఖాతాల తనిఖీకి సిద్ధమవుతుంటే మెప్మాలోని ఓ ఉద్యోగి కొందరు స్థానిక నాయకుల ద్వారా ఒత్తిడి తెచ్చి నిలువరిస్తున్నట్లు సమాచారం. ఖాతాలు మొత్తం తనిఖీ చేస్తే బహిర్గతమయ్యే అక్రమాల ద్వారా తనపైనా చర్యలు ఉంటాయన్న భయంతో సదరు ఉద్యోగి ఈ పాటికే అధికార పార్టీ పెద్దలను కలిసి కోయనగర్ మహిళా సంఘాల విచారణను తప్పుదోవ పట్టించే చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే తేలిన లెక్క రూ.119.27 లక్షలు : మెప్మా ఏర్పాటైన పాతికేళ్లలో పురపాలికలోని మహిళా సంఘాల్లో ఇంత భారీ మొత్తంగా సొమ్ము దుర్వినియోగం జరగలేదు. కోయనగర్ మహిళా సమాఖ్యలో 33 సంఘాలు ఉండగా ఇప్పటివరకు 25 సంఘాల లావాదేవీలు తనిఖీ చేశారు. వీటిలో రూ.119.27 లక్షలు ఆర్పీ శ్రీలత తన అవసరాలకు దుర్వినియోగం చేసినట్లు తేలింది. ఇంకా 8 సంఘాలతో పాటు కోయనగర్ సమాఖ్య ఖాతాను కూడా తనిఖీ చేయాల్సి ఉంది. ఈ దశలో తనిఖీ ప్రక్రియలో వేగం తగ్గడం, విచారణకు అడ్డంకులు ఎదురవటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మెప్మా డీఎంసీ శివకుమార్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా పండగ వల్ల మహిళలు రావటం లేదని, దసరా తర్వాత మిగిలిన 8 సంఘాలతో పాటు కోయనగర్ సమాఖ్య ఖాతాను తనిఖీ చేస్తామన్నారు. ఆ తర్వాత పురపాలిక కమిషనర్ అనుమతితో దుర్వినియోగమైన సొమ్ము వివరాలు తెలియజేస్తామన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే


ఫర్దీపూర్ జలాశయంలో చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: మత్స్యకారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నచింతకుంట మండలంలోని ఫర్దీపూర్ జలాశయంలో చేపపిల్లల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై చేపపిల్లలు విడుదల చేసి మాట్లాడారు. మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేస్తున్నామన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం రాయితీ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండండి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు తాగునీరు అందించే పంప్‌హౌస్‌ల వద్ద ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. దసరా పండగ పురస్కరించుకొని రాయచూర్ రహదారిలోని రాంరెడ్డిగూడెం వద్ద మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో నిర్వహించిన ఆయుధ పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఈఈ బస్వరాజ్, కౌన్సిలర్లు నర్సింహులు, మోతీలాల్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, తిరుమల వెంకటేశ్, పాపారాయుడు, వెంకట్రాములు, చిన్నా తదితరులు పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని గుడిబండతండాలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి రూ.90 వేలు విరాళంగా అందజేసినట్లు సింగిల్ విండో డైరెక్టర్ మంజూనాయక్ తెలిపారు. శుక్రవారం ఆలయం ముందు మార్బుల్ బండలను వేయడానికి రూ.90 వేలు అందజేసినట్లు చెప్పారు. మాజీ సర్పంచి గోపినాయక్, నాగేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నియంత్రికలు కాలిపోతుండటంతో రైతుల ఆందోళన

అడ్డాకుల, న్యూస్‌టుడే: వెంట వెంటనే విద్యుత్తు నియంత్రికలు కాలిపోవడంతో మూసాపేట మండలం నిజాలాపూరు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజాలాపూరు గ్రామంలో వాగు అవతల భూములు ఉన్న రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్తు నియంత్రికలు కాలిపోయిన తరువాత మరమ్మతులు చేసి అమర్చిన గంట వ్యవధిలోనే కాలిపోతున్నాయి. శుక్రవారం కాలిపోయిన నియంత్రికను అతికష్టం మీద పొక్లెయిన్ సహాయంతో వాగులోంచి తీసుకువచ్చిన రైతులు జానంపేట విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద ఏఈని నిలదీశారు. నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మ బోనాలు


సత్రోనిపల్లితండాలో బోనాల ఊరేగింపులో మహిళలు

నవాబ్‌పేట : మండల పరిధిలోని సత్రోనిపల్లితండాలో శుక్రవారం బంగారు మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లూరు, సత్రోనిపల్లితండా, దేపల్లి, చౌడూర్, కేశరావుపల్లి, ఆగిర్యాల, మెట్టుగడ్డతండా, కాకర్జాల, వెంకటేశ్వరతండా, బట్టోనిపల్లితండా, ఎర్రవాడ్కతండా తదితర గ్రామాల నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వ్యాపారవేత్త రాజు కన్నుమూత



పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేటకు చెందిన బంగారం వ్యాపారవేత్త, పట్టణ ప్రముఖుడు సరాఫ్ రాజు(50) శుక్రవారం మృతి చెందారు. ఈయన బంగారు బాలప్ప జూవెల్లర్ అధినేత సరాఫ్ కృష్ణ కుమారుడు. ఇటీవల తన తండ్రి కృష్ణ మృతితో కలత చెందారు. మూడు నెలల క్రితం ఆయనకు మొదటిసారి గుండె పోటు వచ్చింది. హైదరాబాద్‌లో మెరుగైన చికిత్స అనంతరం పేటకు వచ్చారు. శుక్రవారం ఉదయం మరోసారి గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతి చెందారు ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. రాజు మృతికి సంతాపంగా సరాఫ్ బజార్ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం బంగారం దుకాణాలు మూసివేయనున్నారు.

పరుగులో చిరుతలు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు, జడ్చర్ల, న్యూస్‌టుడే : జిల్లా అథ్లెట్లు జాతీయ స్థాయి సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక చేసేందుకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి టోర్నీలో సత్తాచాటారు. సెప్టెంబరు 17, 18 తేదీల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం(ఓయూ)లో మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు 13 పతకాలు వరించాయి. ఇందులో సత్తా చాటి పలువురు సౌత్‌జోన్‌కు అర్హత సాధించారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వీరంతా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉంటూ సాధన చేస్తూ ఇష్టమైన ఆటలో పట్టు సాధిస్తున్నారు. సౌత్‌జోన్ జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధిస్తే వీరికి ఉన్నత విద్య, ఉద్యోగాల్లో క్రీడా కోటా తప్పక దక్కనుంది.


కార్తిక్

గచ్చిబౌలి 'సాయ్'లో శిక్షణ.. : మహబూబ్‌నగర్‌కు చెందిన కార్తిక్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) అథ్లెటిక్స్ అకాడమీలో లాంగ్‌జంప్, హైజంప్‌లో శిక్షణ పొందుతున్నాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ బేసిక్ పాఠశాలలో చదివేటప్పుడు అతడి ప్రతిభను పీఈటీ శ్రీనివాస్ గుర్తించి హైజంప్‌లో శిక్షణ ఇచ్చి ఎదిగేలా ప్రోత్సాహం అందించారు. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అనతికాలంలోనే సాయ్‌లో ప్రవేశం పొందాడు. ఓయూలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటి హైజంప్‌లో స్వర్ణ పతకం అందుకున్నాడు. హెప్ట్ అథ్లాన్‌లో ప్రతిభ చాటాడు. ఇప్పటివరకు ఏడు జాతీయ స్థాయి టోర్నీల్లో సత్తాచాటాడు. ఒలింపిక్స్‌లో భారత్‌కు స్వర్ణమే లక్ష్యమని కార్తిక్ చెప్పాడు.


జ్ఞానేశ్వర్‌రెడ్డి

రాష్ట్రస్థాయిలో రెండు పతకాలు.. : మిడ్జిల్ మండలం మల్లాపూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్‌రెడ్డి జడ్చర్లలోని బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. జడ్చర్లలో గది అద్దెకు తీసుకుని ఉంటూ మహబూబ్‌నగర్‌లో కోచ్ సునీల్ వద్ద సాధన చేస్తున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో హర్డిల్స్‌లో స్వర్ణం, డెక్ అథ్లాన్ కాంస్య పతకాలు అందుకున్నాడు. తండ్రి కూడా క్రీడాకారుడు కావడంతో వెన్నుతట్టడంతో అథ్లెటిక్స్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. భారత జట్టు తరపున ఆసియా క్రీడల్లో రాణించాలన్నదే ధ్యేయమని జ్ఞానేశ్వర్ పేర్కొన్నాడు.


కె.శివ

10కి.మీ.ల పరుగులో స్వర్ణం.. : కోయిలకొండ మండలం అభంగపట్నంకు చెందిన కె.శివ జడ్చర్లలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. పీఈటీలు షంషీర్ అలీ, శేఖర్ ప్రోత్సాహంతో క్రీడలపై దృష్టిసారించాడు. ఆరేళ్లుగా స్టేడియంలో సాధన చేస్తూ 10 కి.మీ.ల పరుగులో రాణిస్తున్నాడు. ఇటీవల ఓయూలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి 10కి.మీ. పరుగులో స్వర్ణ పతకం అందుకున్నాడు. మూడు జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. భారత జట్టుకు ఆడాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు కె.శివ.


శివ కుమార్

'ఈనాడు' లక్ష్యలో చేరేందుకు.. : భూత్పూరు మండలం వెల్కిచర్లకు చెందిన కారంపేట శివకుమార్ కోయిలకొండలోని మహాత్మా జ్యోతిరావు పులే కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పీఈటీ శ్రీను ప్రోత్సాహంతో 100 మీ.ల పరుగులో నిలకడగా రాణిస్తున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో 100 మీ.ల పరుగులో రజతం, 200 మీ.ల పరుగులో కాంస్య పతకాలు అందుకున్నాడు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధానిలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నీలోనూ పాల్గొన్నాడు. 'ఈనాడు' లక్ష్యలో చేరేందుకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా సాధన చేస్తున్నట్లు పేర్కొన్నాడు. ఒలింపిక్స్‌లో పతకం అందుకోవాలన్నదే తన లక్ష్యమని వివరించాడు శివ కుమార్.

పొన్నకల్‌లో వైద్య శిబిరం

అడ్డాకుల, న్యూస్‌టుడే: మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన ఆర్థో వైద్య నిపుణుడు డా. కల్యాణ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వందకు పైగా గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నలుగురికి మోకాళ్ల గుజ్జు పెరిగేందుకు ఇంజెక్షన్ ఇవ్వగా మిగతా వారికి రూ.50వేలకు పైగా విలువైన మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు డాక్టర్ తెలిపారు.

ఎంపీడీవోగా అనిల్‌కుమార్

బాలానగర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోగా అనిల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజశేఖర్‌తో పాటు కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో శాలువాలతో సన్మానించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరి మృతి

అడ్డాకుల, న్యూస్‌టుడే: వనపర్తి జిల్లా పెద్దమందడి మండల మదిగట్లకు చెందిన శేరిమీది నాగరాజు(35) అడ్డాకుల సమీపంలోని ఓ క్రషర్‌లో పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపు తప్పి రహదారి పక్కకు దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో నాగరాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుమిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.శ్రీనివాస్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

భూత్పూర్, న్యూస్‌టుడే: భూత్పూర్ పురపాలక సంఘం పరిధిలోని అమిస్తాపూర్ గ్రామానికి చెందిన వీరాపురం మల్లేష్(35) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 7న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఉస్మానియాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గండీడ్, న్యూస్‌టుడే: మండలంలోని రుసుంపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య పని నిమిత్తం శుక్రవారం చిన్నవార్వాల్ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారు దుందుభి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాకర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని స్థానికుల సమాచారం మేరకు సిబ్బంది దాడి చేసి పట్టుకోగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ


నేతాజీచౌక్‌లో స్తంభించిన ట్రాఫిక్

జడ్చర్ల, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో జడ్చర్ల పట్టణంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జడ్చర్లలో శుక్రవారం సిగ్నల్‌గడ్డ పై వంతెన వద్ద గురువారం కంటెయినర్ బోల్తా పడటంతో వాటిలో ఉన్న ఇనుప దిమ్మెలను కిందకు దింపి కంటెయినర్‌ను పోలీసులు అక్కడి నుంచి తీసివేశారు. అక్కడే ఉన్న ఇనుప దిమ్మెలను పక్కకు తొలగించే సమయంలో మధ్యాహ్నం సిగ్నల్‌గడ్డ వంతెన వద్ద రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. దీనికి తోడు దసరా పండగ కోసం ఎక్కువ మంది సామగ్రి, దుస్తులు కొనుగోలు చేసేందుకు రావడంతో నేతాజీచౌక్‌లో, సిగ్నల్‌గడ్డ, జాతీయ రహదారి పై వంతెన వద్ద రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దీంతో కొందరు నల్లకుంట రైల్వే అంతర్గత వంతెన వద్ద వెళ్లేందుకు ప్రయత్నించడంతో కార్లు, ఆటోలు ఎదురెదురుగా రావడంతో రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని నేరళ్లపల్లి నుంచి ఉటుకుంట తండా వెళ్లేందుకు వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారాస హయాంలో 3 కి.మీ దూరంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారు గుంతలు తీయించి, పనుల కోసం కంకర వేసి వదిలేశారు. ఏడాది కావస్తున్నా ఇంకా పనులు ప్రారంభించలేదు. గుత్తేదారు అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నామని తండా వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


ఉటుకుంటతండాకు వెళ్లే రహదారి